
సాక్షి
కర్నూలు
గురువారం । 23 । జనవరి । 2025

లోక కల్యాణార్థం..!



శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణార్థం బుధవారం సాయంత్రం శ్రీశైల ఆలయంలోని సాక్షిగణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు, పుష్పార్చన చేపట్టారు.



అలరించిన భక్తి రంజని

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై బుధవారం కర్నూలుకు చెందిన టి.నారాయణ కళాజాత బృందం నిర్వహించిన భక్తిరంజని కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.



భక్తుడిని అతిథిగా భావించాలి

శ్రీశైలంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చి వచ్చే ప్రతి భక్తుడిని అతిథిగా భావించి సేవలందించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులకు సూచించారు. 8లో▶

న్యూస్‌రీల్

రెవెన్యూ అధికారుల పని విభజనపై అధ్యయనం

కర్నూలు(సెంట్రల్): జిల్లాల పునర్ వ్యవస్థీకరణ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, సబ్ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ అధికారాల పంపిణీ, పని విభజన, బాధ్యతలపై అధ్యయనం చేస్తున్నట్లు సీసీఎల్ఏ కమిషనర్ జయలక్ష్మీ తెలిపారు. బుధవారం ఆమె విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ విషయంపై గుంటూరు, కర్నూలు, చిత్తూరు జిల్లా కలెక్టర్లతో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయి అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.

సంఘాల ఆర్థిక అభివృద్ధే ఎన్‌సీడీసీ లక్ష్యం



మాట్లాడుతున్న సీఈఓ విజయకుమార్

కర్నూలు(అగ్రికల్చర్): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు వ్యాపారాభివృద్ధికి కట్టుదిట్టమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈఓ విజయకుమార్ తెలిపారు. బుధవారం కర్నూలు డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో పీఏసీఎస్‌లు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సీఈఓలకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) శిక్షణా కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ... సొసైటీలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు ఎన్‌సీడీసీ అవకాశం కల్పిస్తోందని తెలిపారు. ఎన్‌సీడీసీ రీజినల్ డైరెక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ... ఇటువంటి సంఘాలకు ఎన్‌సీడీసీ మూడేళ్లలో రూ.15 లక్షల ఈక్విటీ గ్రాంటు (షేర్ క్యాపిటల్), మేనేజ్‌మెంటు గ్రాంటు రూ.18 లక్షలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎన్.రామాంజనేయులు, డీసీసీబీ జనరల్ మేనేజర్ పి.రామాంజనేయులు పాల్గొన్నారు.

వేదభూమి.. శోక సంద్రం

- కర్ణాటకలోని సింధనూరు సమీపంలో వాహనం బోల్తా
- ముగ్గురు శ్రీమఠం వేద పాఠశాల విద్యార్థుల దుర్మరణం
- వాహనం డ్రైవర్ మృతి
- మంత్రాలయంలో అలుముకున్న విషాదఛాయలు

మంత్రాలయం: నిత్యం వేద ఘోషతో విరాజిల్లే వేదభూమి శోక సంద్రమైంది. కర్ణాటకలోని సింధనూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు శ్రీమఠం వేద విద్యార్థుల దుర్మరణంతో మంత్రాలయం మూగబోయింది. విద్యార్థుల మృత్యు ఘటన స్థానికులను కలచివేసింది. శ్రీమఠం క్షేత్రం చరిత్రలోనే ఇదో విషాద ఘటన. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి మఠం నేతృత్వంలో గురుసార్వభౌమ సంస్కృత విద్యాపీఠాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మధ్వ మత పూర్వపు పీఠాధిపతి నరహరి తీర్థుల ఉత్తరారాధన చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి 8 గంటలకు వేద పాఠశాల నుంచి విద్యార్థులను వాహనాల్లో కర్ణాటకలోని హంపిలో నరహరి తీర్థుల క్షేత్రానికి పయనమయ్యారు. పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ట్రాక్స్ క్రూయిజర్ వాహనంలో బయలుదేరారు. మార్గ మధ్యలో కర్ణాటకలోని రాయచూరు జిల్లా సింధనూరు నియోజకవర్గ కేంద్రాన్ని దాటుకుని వెళ్తుండగా వాహనం ప్రమాదానికి గురైంది. మంగళవారం రాత్రి సుమారు 10.20 గంటల సమయంలో సింధనూరుకు 4 కి.మీ. దూరంలోని వైష్ణవి దేవి ఆలయంతో రాయచూరు–కొప్పళ రహదారిపై ప్రమాదవశాత్తు ముందు టైర్ పేలింది. వేగంగా వెళ్తుండటంతో అదే సమయంలో చక్రం యాక్సిల్ కట్ కావడంతో ట్రాక్స్ క్రూయిజర్ వాహనం మూడు పల్టీలు కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న విద్యార్థుల్లో ముగ్గురుతోపాటు జీపు డ్రైవర్ ప్రమాద స్థలంలోనే దుర్మరణం చెందారు. క్రూయిజర్ పాత వాహనం కావడంతో పాటు అతి వేగంతో ప్రయాణించడం వల్ల టైర్ పేలి ఇంతటి ఘోరం జరిగిందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.





సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మృతుల వివరాలు



మృతి చెందిన జీపు డ్రైవర్ శివ

ప్రమాద ఘటనలో స్థానిక సంస్కృత పాఠశాలలో వేద విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు హయవదన (18), సుజయీంద్ర (22), అభిలాష్ (20), డ్రైవర్ కంసాలి శివ (20) అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. కారులో ప్రయాణిస్తున్న మిగిలిన 10 మంది విద్యార్థులు జయసింహ (23), శ్రీహరి (18), విజయేంద్ర (17), భరత్ (16), రాఘవేంద్ర (16), తనీత్ (13), శ్రీఖర (16), వాసుదేవ (14), రాఘవేంద్ర (17), బసంత శర్మ (15) గాయపడ్డారు.

- ఈ ప్రమాదంలో మంత్రాలయానికి చెందిన విష్ణు ఆచార్ (కృష్ణమూర్తి), జానకి దంపతుల ఏకైక కుమారుడు సుజయీంద్ర (22), కంసాలి సోమన్న, కాశమ్మ దంపతుల నాల్గవ కుమారుడు డ్రైవర్ శివ(20) మృత్యువాత పడ్డారు. కర్ణాటకలోని కొప్పళ జిల్లా కేంద్రానికి చెందిన అశ్వత్ ఓబీ కుమారుడు అభిలాష్ (20), బళ్లారి జిల్లా వాసి ప్రహ్లాదాచారి కుమారుడు హయవదన (18) మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని చేరుకున్న సింధనూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటేష్ చౌహాన్.. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు. సింధనూరు ఏరియా ఆసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించగా మిగిలిన క్షతగాత్రులు సింధనూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు విద్యార్థి సుజయీంద్ర, డ్రైవర్ శివ మృతదేహాలు మంత్రాలయం చేరుకున్నాయి. సుజయీంద్ర మృతదేహాన్ని స్థానిక సంత మార్కెట్‌లో ఉంచగా స్థానికులు వేలాది గా తరలివచ్చి కన్నీరుమున్నీరయ్యారు. ఇరువురికి వారి సంప్రదాయ పద్ధతుల్లో అంత్యక్రియలు పూర్తి చేశారు.



సుజయీంద్ర మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి, కుటుంబీకులు

సంబరాల వేళ మిన్నంటిన విషాదం

మధ్వమత పూర్వపు పీఠాధిపతి నరహరి తీర్థులు కర్ణాటకలోకి తుంగభద్ర నదీతీరం హంపి క్షేత్రంలో బృందావనస్థులయ్యారు. అయితే సదరు మఠంపై ఆధిపత్యం కోసం కర్ణాటలోని ఉత్తరాది మఠం, మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం మధ్య తగవు నడుస్తోంది. ఈ విషయంలో ఇరు మఠాలు కర్ణాటక ధార్వాడ హైకోర్టును ఆశ్రయించాయి. సోమవారం నరహరి తీర్థుల ఆరాధన వేడుకలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పూర్వారాధనకు శ్రీమఠం నుంచి అర్చకులు వెళ్లి పూజలు చేసుకున్నారు. అంతకు ముందు నరహరి మఠం అధికారాలు ఉత్తరాది మఠానికి చెల్లుతాయని ఏకసభ్య ధర్మాసనం తీర్పు వెలువరించింది. తీర్పును సవాలు చేస్తూ శ్రీమఠం ద్విసభ్య ధర్మాసనానికి కేసును తీసుకెళ్లగా మంగళవారం సదరు ధర్మాసనం శ్రీమఠానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో మంగళవారం రాత్రి నరహరి క్షేత్రానికి పయనం కట్టారు. బుధవారం ఉదయం ఉత్తరారాధన నిర్వహించాలని మంత్రాలయం నుంచి 10 వాహనాల్లో పీఠాధిపతితో సహా ఉద్యోగులు, అర్చకులు, సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు, ప్రముఖులతో హంపికి రాత్రి 8 గంటలకు బయలు దేరారు. అనుకోని ప్రయాణంతో మార్గ మధ్యలో ఈ దుర్ఘటన చోటు చేసుకోవడం ఎందరినో కలచి వేసింది.

అన్ని విధాలా ఆదుకుంటాం

ఆరాధన వేడుకలకు వెళ్తూ అనుకోకుండా రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన ఆత్మీయ వేద పాఠశాల విద్యార్థుల మృతి పట్ల శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు విషాదాన్ని వ్యక్తం చేశారు. దుర్ఘటన ఎంతగానో కలచి వేసిందని పేర్కొన్నారు. మృతుల కటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకుంటామని స్పష్టం చేశారు. రాత్రి వరకు సింధనూరులోనే ప్రమాద ఘటన వివరాలు తెలుసుకుంటూ స్టే చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానిక ఆసుపత్రి అధికారులకు సూచించారు.

గర్భిణుల వివరాలు వంద శాతం నమోదు చేయాలి

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): గర్భం దాల్చిన మూడు నెలల్లోపే మహిళల వివరాలను వంద శాతం నమోదు చేసి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా వైద్య, ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ వైద్య, ఆరోగ్యశాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతాల్లో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ఉన్నా కొన్ని చోట్లా మూడు నెలల గర్భిణుల వివరాలను నమోదు చేయలేకపోతున్నారన్నారు. అభా ఐడీల జనరేషన్‌కు సంబంధించి 68 శాతం మాత్రమే పూర్తయిందని, ఇంకా 7 వేల మందికి కార్డులు ఇవ్వాల్సి ఉందన్నారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలు ఎక్కువగా నమోదవుతున్నాయని, అందుకు కారణాలను విశ్లేషించాలని, ఇందుకోసం డివిజన్ స్థాయిలో ఆర్డీఓ ఆధ్వర్యంలో సబ్ కమిటీలను ఏర్పాటు చేయాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. బాల్య వివాహాలతో టీనేజ్ ప్రెగ్నెన్సీ ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని, బాల్య వివాహాల నివారణకు చర్యలు తీసుకోవాని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీకృష్ణ ప్రకాష్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రమణ్యం, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్, డీసీహెచ్ఎస్ మాధవి, మలేరియా అధికారి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయండి

విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికితీయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో బాలోత్సవం- 2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎక్కువ మంది బాలలను భాగస్వామ్యం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో బాలోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు డి.ధనుంజయ, జేఎస్ శేషయ్య, కెంగార మోహన్, జె.రంగస్వామి, హేమంత్ కుమార్, రవికుమార్, జయరాజు, సుధీర్ రాజు, ఎల్లా గౌడ్, సాయి ఉదయ్ పాల్గొన్నారు.

సాంకేతికతతో కేసులు ఛేదించాలి

- అర్హత కలిగిన సీఐలకు త్వరలో పదోన్నతులు
- డీజీపీ ద్వారకా తిరుమల రావు



కర్నూలు: సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ కేసులు ఛేదించాలని పోలీసు అధికారులను డీజీపీ ద్వారకా తిరుమల రావు ఆదేశించారు. డీపీఓలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ బిందు మాధవ్, అడ్మిన్ ఏఎస్పీ హుసేన్ పీరా తదితరులు హాజరయ్యారు. కడపలో అధికారిక కార్యక్రమంలో పాల్గొని నంద్యాల మీదుగా రోడ్డు మార్గంలో బుధవారం ఉదయం కర్నూలు చేరుకున్న డీజీపీకి పోలీసు అధికారులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పోలీసులందరూ సమష్టి కృషితో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలను అరికట్టాలని సూచించారు. సైబర్ నేరాలు, చిన్నపిల్లలు, మహిళలపై జరిగే లైంగిక నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలని సూచించారు. ఇందుకోసం విస్తృతంగా టెక్నాలజీని ఉపయోగించాలన్నారు. అర్హత కలిగిన సీఐలందరికీ త్వరలో డీఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ ద్వారకా తిరుమల రావు, హాజరైన పోలీస్ అధికారులు

పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న డీజీపీ

తాను కర్నూలు జిల్లాలో ట్రైనీ ఏఎస్పీగా చేశానని.. ఆ విషయాలను, జ్ఞాపకాలను డీజీపీ ద్వారకా తిరుమల రావు గుర్తు చేసుకున్నారు. నేరాలను అరికట్టడం, శాంతిభద్రతల పరిరక్షణ విషయాల గురించి శిక్షణ సమయంలో జిల్లాలో అనేక విషయాలు తెలుసుకున్నానన్నారు. అనంతరం డీజీపీని రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ బిందు మాధవ్ కలసి శాలువతో సత్కరించి నటరాజ విగ్రహం జ్ఞాపికను అందజేశారు. అనంతరం వ్యాస్ ఆడిటోరియం ఎదుట పోలీసు అధికారులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కొద్దిసేపు మీడియాతో కూడా మాట్లాడారు. సదరన్ రీజియన్ హోంగార్డ్ కమాండెంట్ ఎం.మహేష్ కుమార్, డీఎస్పీలు బాబుప్రసాద్, వెంకటరామయ్య, ఉపేంద్ర బాబు, హేమలత, భాస్కర్ రావు, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, సీఐలు, ఆర్ఐలు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం డీజీపీ రోడ్డు మార్గాన హైదరాబాదు బయలుదేరి వెళ్లారు.

కొనసాగుతున్న పోలీసు దేహదారుఢ్య పరీక్షలు

- ప్రధాన పరీక్షకు 286 మంది ఎంపిక

కర్నూలు: కర్నూలు ఏపీఎస్పీ రెండవ పటాలం మైదానంలో పోలీసు అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల్లో బుధవారం 12వ రోజు 600 మందిని ఆహ్వానించారు. ఇందులో 415 మంది బయోమెట్రిక్ పరీక్షకు హాజరు కాగా వారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ చుట్టు కొలతలు వంటి ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్టులు నిర్వహించారు. అర్హత సాధించిన వారికి ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. వాటిలో ప్రతిభ కనబరచి 286 మంది అభ్యర్థులు ప్రధాన పరీక్ష (మెయిన్స్)కు అర్హత సాధించారు. ఏదైనా సమస్యలపై ఇతర కారణాలతో అప్పీల్ చేసుకున్న అభ్యర్థులు ఈనెల 28వ తేదీన హాజరుకావాలని పోలీసు అధికారులు సూచించారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు సెలవు దినాలు మినహా పోలీసు అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఎస్పీ బిందు మాధవ్‌తో పాటు సదరన్ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పరుగుపందెంలో పోటీ పడుతున్న కానిస్టేబుల్ అభ్యర్థులు

వైభవంగా స్వాతి వేడుకలు

ఆళ్లగడ్డ: శ్రీమద్ అహోబిలం క్షేత్ర పరిధిలో వెలసిన నవనారసింహ ఆలయాలు బుధవారం భక్త జనసంద్రంగా మారాయి. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి వేడుకలను పురస్కరించుకుని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేడుకల్లో భాగంగా దిగువ అహోబిలంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ఉత్సవమూర్తులైన పావన లక్ష్మీనృసింహస్వామిని, సుదర్శనమూర్తులను దేవాలయం ప్రధాన ద్వారం ఎదురుగా యాగశాలలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించారు. నవకలశాలతో తిరుమంజనం నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేద పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య స్వాతి, సుదర్శన హోమాలు వైభవోపేతంగా సాగాయి. పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి.



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

క్లుప్తంగా

నగరంలో చైన్ స్నాచింగ్

కర్నూలు: కర్నూలు శివారులోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో చైన్ స్నాచింగ్ జరిగింది. గడివేముల మండలం పెసరవాయి గ్రామానికి చెందిన శివ వీరేశ్వరరెడ్డి గణేష్ నగర్-2లో నివాసముంటాడు. ఈయన స్వగ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్లుగా కర్నూలులో నివాసముంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఆయన భార్య మంగమ్మ నన్నూరుకు వెళ్లేందుకు ఇంటి నుంచి నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ మీదుగా నంద్యాల చెక్‌పోస్టు వైపు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని యువకుడు హోండా స్కూటీపై ఎదురుగా వచ్చి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లాక్కున్నాడు. ఆమె అప్రమత్తమై దొంగ.. దొంగ.. అంటూ కేక వేసేలోగా వాహన వేగాన్ని పెంచి పక్క సందులోకి నుంచి పరారయ్యాడు. బాధితురాలు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శేషయ్య ఆదేశాల మేరకు క్రైం పార్టీ సిబ్బంది ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల్లో పుటేజీని సేకరించి దొంగను గుర్తించే పనిలో ఉన్నారు.

మామిడి తోటలో చిరుతపులి

మహానంది: మహానంది సమీపంలోని ఎంసీ ఫారం గ్రామంలోని ఉద్యాన పరిశోధన స్థానం వద్ద మామిడి తోటల సమీపంలో బుధవారం చిరుతపులి కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమీప గ్రామాలకు చెందిన వ్యవసాయ కూలీలు, హెచ్‌ఆర్‌ఎస్‌లో పని చేస్తున్న వారు మామిడితోటల్లో పనులకు వెళ్లారు. మధ్యాహ్నం వేళలో ఉద్యాన పరిశోధన స్థానం వద్ద ఉన్న మామిడి తోటలో చిరుతపులి కనిపించడంతో పనులకు వెళ్లిన వారు ప్రాణభయంతో పరుగులు తీశారు.

వాహనం ఢీకొని జింక మృతి

ఆలూరు రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. ఆలూరు సమీపంలో 167 హైవేలో బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. ప్రయాణికులు గమనించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, బీట్ ఆఫీసర్లు, మధు మోహన్, విమల్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో జింక మృతిచెందినట్లు వెల్లడించారు. పశువైద్యాధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బళ్లారి రహదారిలో జింక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.

సీసీ రోడ్ల పనుల బిల్లుల అప్‌లోడ్‌పై అసంతృప్తి

కర్నూలు (అర్బన్): జిల్లాలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులను అప్‌లోడ్ చేయడంలో జరుగుతున్న జాప్యంపై పంచాయతీరాజ్ ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం తన ఛాంబర్‌లో డీఈఈ, ఏఈలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జిల్లాలో రూ.67 కోట్లతో 830 పనులు చేపట్టామన్నారు. అయితే, బిల్లులను అప్‌లోడ్ చేయడంలో ఎందుకు వెనుకబడ్డారని క్షేత్రస్థాయిలోని ఇంజినీర్లను ప్రశ్నించారు. 90 శాతం పనులకు గాను కనీసం రూ.50 కోట్ల బిల్లులను అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. అయితే ఇప్పటివరకు రూ.36 కోట్ల వరకు మాత్రమే బిల్లులను అప్‌లోడ్ చేసినట్లు తెలుస్తోందన్నారు. మిగిలిన రూ.14 కోట్ల బిల్లులను వారంలోగా అప్‌లోడ్ చేయకపోతే సంబంధిత ఇంజినీర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఈఈ ఎన్‌సీఎస్ మద్దన్న, డీఈఈలు బండారు శ్రీనివాసులు, నాగిరెడ్డి, కర్రెన్న, శేషయ్య పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల



కర్నూలు (సిటీ): క్లస్టర్ యూనివర్సిటీ మూడవ సెమిస్టర్ డిగ్రీ ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది అక్టోబర్‌లో నిర్వహించిన పరీక్షలకు మొత్తం 856 మంది విద్యార్థులు హాజరుకాగా 574 మంది (67 శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. ఫెయిలైన విద్యార్థులు ఫిబ్రవరి 3వ తేదీలోగా రీవాల్యూయేషన్‌కు అప్లయ్ చేసుకోవాలని ఎగ్జామినేషన్ డీన్ తెలిపారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కె.బాలసుబ్రహ్మణ్యం, జూనియర్ అసిస్టెంట్ వెంకటరమణయ్య పాల్గొన్నారు.



మొక్కల గురించి అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



వ్యవసాయకూలీలతో కలిసి వరి నాట్లు వేస్తున్న విద్యార్థులు

అన్నింటా ఆదర్శమే!

- జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందిన మహానంది మోడల్ స్కూల్
- చదువుతో పాటు వివిధ అంశాలకు ప్రాధాన్యత
- ప్రయోగాల్లో జాతీయ స్థాయి గుర్తింపు

చదువులో, ప్రయోగాల్లో, సామాజిక అంశాల్లో, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ఆ పాఠశాల ముందుంటుంది. జీరోవేస్ట్, జీవ వైవిధ్యం, ప్లాస్టిక్ వ్యర్థాలకు పచ్చందం, మట్టితో మనోహర దృశ్యాలు సాక్షాత్కరిస్తోంది. ఇలా ఎన్నో విశేషాలతో జిల్లాలో జాతీయ స్థాయి గుర్తింపు సాధించిన ఏకైక పాఠశాలగా నిలిచింది మహానంది మోడల్‌స్కూల్. పేరులోనే కాదు అన్నింటా ఆదర్శమైన ఈ పాఠశాలపై ప్రత్యేక కథనం.



తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్

మహానంది: మండల కేంద్రమైన ఎం. తిమ్మాపురంలో 2013–14లో ఆదర్శ పాఠశాల ఏర్పాటైంది. ఆరో తరగతి నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ వరకు తరగతులు ఉన్నాయి. అన్ని తరగతుల్లోనూ ఇంగ్లిష్ మీడియం ఉంది. నాణ్యమైన విద్యాబోధన అందుతుండటంతో ప్రవేశాలకు డిమాండ్ ఉంటుంది. తరగతికి వంద సీట్లు ఉంటే వాటికి దరఖాస్తులు చేసుకునేవారి సంఖ్య రెట్టింపు సంఖ్యలో ఉంటుంది. ప్రవేశ పరీక్షల ద్వారా రిజర్వేషన్ల వారీగా విద్యార్థినీ విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం ఉంది.



జాతీయ స్థాయిలో నిలిచిన ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు

ప్రస్తుతం ఈ పాఠశాలలో 650 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడి ఉపాధ్యాయుల బోధన చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ప్రాక్టికల్ విద్యకు ప్రాధాన్యత ఇస్తారు. దీంతో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఇక్కడి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.



మొక్కలకు సేంద్రియ ఎరువులు అందిస్తూ..

జాతీయ స్థాయిలో నిలబెట్టిన జీరోవేస్ట్

బియ్యం కడిగిన నీళ్లు, కోడిగుడ్ల పెంకులు, కూరగాయ తొక్కలు లాంటి వ్యర్థాలను సక్రమంగా వినియోగిస్తూ మొక్కలను సేంద్రియ ఎరువులను అందిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ పట్ల 400 పేజీలతో తయారు చేసిన ఓ డాక్యుమెంట్ పాఠశాలను జాతీయ స్థాయిలో నిలబెట్టింది.

దేశవ్యాప్త పోటీల్లో టాప్

ఈ భూమి మానవులతో కూడిన జీవులన్నింటిది అనే ఇతి వృత్తంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల బృందం జీవవైవిధ్యం పేరుతో చేసిన ప్రాజెక్ట్ జాతీయస్థాయిలో బహుమతి సాధించింది. ఈ ఏడాది మార్చిలో ఢిల్లీలో విప్రో సీఈఓ రిషబ్ ప్రేమ్‌జీ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. ఇది పాఠశాల సాధించిన విజయాల్లో అత్యున్నతమైనదిగా ప్రిన్సిపాల్ లక్ష్మణరావు 'సాక్షి'తో చెప్పారు.

ప్లాస్టిక్ వ్యర్థాలకు కొత్త రూపు

ప్లాస్టిక్ వ్యర్థాలకు విద్యార్థులు సొబగులు దిద్దారు. దుకాణాల్లో వాడి పడేసిన ప్లాస్టిక్ డబ్బాలపై అందమైన రంగులు, డిజైన్లు వేసి వాటి రూపురేఖలనే మార్చేశారు. ఖరీదైనా పూలకుండీల్లా తీర్చిదిద్దారు. రోడ్లపై పడేసే వాటర్ బాటిళ్లు సేకరించి వాటిలో చిప్స్ కవర్లను నింపి ఎకోబ్రిక్స్‌గా మార్చి స్టూళ్ల తయారీకి వినియోగించారు. అలాగే రసాయనిక రంగులతో కాకుండా పాఠశాల క్రీడా మైదానంలో ఉన్న పలు రకాల మట్టిని సేకరించి వాటి నుంచి వివిధ రంగులను సృష్టించి వాటితో గోడపై కళాకృతులను గీసి ప్రకృతి గొప్పతనాన్ని ఆవిష్కరించారు.

ఐదు ప్రాజెక్టులు ఎంపిక

ప్రభుత్వం ప్రతి ఏడాది నిర్వహించే ఇన్‌స్పైర్ ప్రాజెక్టులకు పాఠశాల నుంచి గతేడాది ఏకంగా ఐదు ప్రాజెక్టులు ఎంపిక అయ్యాయి. ఎంపికైన ప్రతి ప్రాజెక్టును మరింత మెరుగుపరచడానికి రూ. పది వేలు చొప్పున విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందిస్తుంటారు. జాతీయ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్‌లో జిల్లాలోనే ప్రథమ స్థానం ఈ పాఠశాల సొంతం. 2022–23 విద్యాసంవత్సరంలో ఎన్ఎంఎంఎస్‌లో ఈ పాఠశాల నుంచి 11 మంది విద్యార్థులు ఎంపికై తమ సత్తా చాటుకున్నారు.

నెలకోసారి పొలం బాట

విద్యార్థులకు తరగతి గదిలో చదువు చెప్పడమే కాదు నెలకోసారి ఫీల్డ్ విజిట్ నిర్వహిస్తారు. వ్యవసాయ క్షేత్ర పర్యటనలో భాగంగా పొలాల్లో వరినాట్లు వేయడం, కలుపు తీయడం, మందు చల్లడం, పంటలు పండే తీరును చూపిస్తారు. రైతుల కష్టాలు, లాభ, నష్టాలను స్వయంగా తెలుసుకునేలా చేస్తారు. దీంతో పాటు జాతీయ సైన్స్ దినోత్సవం, జాతీయ గణిత దినోత్సవం, జాతీయ మహిళా దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవం వంటి పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందిస్తున్నారు.

సమష్టి సహకారంతోనే జాతీయ స్థాయి గుర్తింపు



ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సంపూర్ణ సహకారంతోనే పాఠశాల జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించింది. విద్యార్థుల ఆశలను, తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేర్చడానికి ప్రయత్నిస్తున్నాం. దీంతో మోడల్ స్కూల్స్ విభాగంలో మహానంది పాఠశాల ప్రత్యేకత సాధించడం ఆనందంగా ఉంది - కూరపాటి లక్ష్మణరావు, ప్రిన్సిపాల్

స్కూల్‌కెళ్లాలంటే ఆనందంగా ఉంటుంది



పాఠశాలకు వెళ్లాలనే ఆసక్తి ఎప్పుడూ ఉండేలా మా సారొళ్లు మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. మా పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. రోజుకో కొత్త ప్రోగ్రాం చేస్తుంటారు. ఇంటి దగ్గర కంటే పాఠశాలలోనే ఎక్కువ సేపు ఉండాలనిపిస్తుంది. -కమలాకర్, పదోతరగతి

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థినులు



కేంద్రం వద్దకు తరలివచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు

కర్నూలు సిటీ: జాతీయ ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల కోసం జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్ష సమయానికి రెండు గంటలకు ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. అయితే ఉదయం చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో పలువురు విద్యార్థులకు రెండు గంటలు ముందుగానే చేరుకునేందుకు కొంత ఇబ్బందులు పడ్డారు. పరీక్ష వేళకు 40 నిమిషాల ముందు నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. కర్నూలు సనత్‌నగర్‌లోని ఐయాన్ డిజిటల్ జోన్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఉదయం 286 మందికిగాను 264 మంది, మధ్యాహ్నం 253 మందికిగాను 219 మంది హాజరయ్యారు. నంద్యాల సమీపంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 166మందికి గాను 154 మంది హాజరయ్యారు. జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఈనెల 30వ తేదీ వరకు జరగనున్నాయి. 23, 24, 28, 29 తేదీల్లో ఇంజినీరింగ్, 30న బీఆర్క్ (బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్) పరీక్షలు జరుగనున్నాయి.

జాతీయ స్థాయి పోటీలకు పత్తికొండ విద్యార్థిని

పత్తికొండ(తుగ్గలి): జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు పత్తికొండకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు మధుసూదన నాయుడు కూతురు అమృత ఎంపికైంది. పట్టణంలోని ఓ ప్రవేటు పాఠశాలలో ఆ విద్యార్థిని 9వ తరగతి చదువుతోంది. స్థానిక కోవాన్‌టెక్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. ఈ నెల 6, 7, 8వ తేదీల్లో గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన అండర్–17 విభాగం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలికల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఆ జట్టులో అద్భుతంగా రాణించిన అమృత ఫిబ్రవరి 2 నుంచి హర్యానాలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆ విద్యార్థినిని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్, అకాడమీ కోచ్ సుంకన్న అభినందించారు.



అమృతను అభినందిస్తున్న డీఈఓ శామ్యూల్‌పాల్

రైస్ మిల్లులో కూలిన బంకర్

- ఒకరు మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

బనగానపల్లె రూరల్: రైస్ మిల్లులో బంకర్ కూలి ఒకరు మృతి చెందగా..ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం బనగానపల్లెలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ దుగ్గిరెడ్డి వివరాలకు మేరకు.. అవుకు రోడ్డులో శ్రీనివాస రైస్ మిల్లు ఉంది. ఇందులోని బంకర్ వద్ద సుజిత్‌కుమార్ (26), దశరథ సహాని, బీరేంద్రసహా పనిచేస్తుండగా ఆకస్మాత్తుగా బంకర్ కూలి వారి పై పడింది. ఈ ఘటనలో బిహార్‌కు చెందిన సుజిత్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు మెరుగైన వైద్య కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.





కూలిన బంకర్ (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన సుజిత్‌కుమార్

వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడిగా శ్రీనివాసులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడిగా వి. శ్రీనివాసులు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కర్నూలు నగరానికి చెందిన ఆయనను నియమిస్తు బుధవారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

24న సుకన్య సమృద్ధి ఖాతా స్పెషల్ డ్రైవ్

కర్నూలు(అర్బన్): ఈ నెల 24వ తేదీన జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని పోస్టాఫీసుల్లో 'సుకన్య సమృద్ధి ఖాతా'ను తెరిచేందుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జీ జనార్దన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలికల కోసం 2015 జనవరి 22వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని ప్రారంభించారన్నారు. 10 సంవత్సరాలలోపు బాలికలందరికీ ఈ ఖాతాను రూ.250 నామమాత్రపు రుసుముతో తమకు సమీపంలోని పోస్టాఫీసుల్లో తెరిచేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి నెలా ఆన్‌లైన్‌లో కూడా నగదును జమ చేయవచ్చన్నారు.

చీర కొంగు యమపాశమై..

- బైక్ చక్రానికి చుట్టుకున్న చీర
- కింద పడి మహిళ మృతి

మంత్రాలయం: ఆమె చీర కొంగు యమపాశమై ప్రాణం తీసింది. చిన్న పాటి ఏమరపాటుకు నిండు ప్రాణం బలైంది. మంత్రాలయం మండలం సూగూరు గ్రామానికి చెందిన లక్ష్మన్న, శారదమ్మ దంపతులు హోటల్ నడుపుకుని జీవనం సాగిస్తున్నారు. బుధవారం హోటల్ సంత నిమిత్తం బైక్‌పై ఇద్దరు బయలు దేరారు. మాధవరం - సూగూరు రోడ్డులోని ఇస్పాత్ మారుతి స్టీల్ ఫ్యాక్టరీ సమీపంలో బైకు వెనుక చక్రంలో శారదమ్మ (40) చీరకొంగు చుట్టుకోవడంతో ఆమె బైక్ పైనుంచి జారి కింద పడింది. ఆమె తలకు తీవ్ర రక్తం గాయం కావడంతో మృత్యువాత పడింది. హెడ్ కానిస్టేబుల్ ఎ.ఆంజనేయులు సంఘటన స్థలం చేరకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన జిల్లాస్థాయి రంగోత్సవం పోటీలు

కర్నూలు సిటీ: బి. తాండ్రపాడులోని ప్రభుత్వ డైట్ కాలేజీలో నిర్వహించిన జిల్లాస్థాయి రంగోత్సవం పోటీలు బుధవారం ముగిశాయి. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, కేంద్రీయ విద్యాలయం, నవోదయ, రెసిడెన్షియల్ స్కూళ్లలో 6, 7, 8, 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. విజేతలకు డైట్ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయూబ్ హుస్సేన్ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా స్థాయిలో మొదటి విజేతలుగా నిలిచిన వారందరూ ఈ నెల 24వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి రంగోత్సవ పోటీల్లో పాల్గొనాల్సి ఉంది.

విజేతలు వీరే..

క్విజ్ పోటీలు.. ఎం.డి షీఫా మహవీస్, ఎస్.పూజ, పి.మహమ్మద్ షఫీ

డ్రాయింగ్ కాంపిటీషన్.. కె.విశాల్, కె.చూర, ఎస్.ఆరిఫ్ అహమ్మద్

చేతి రాత (తెలుగు).. ఎ.హర్షిత, వి.ధర్మతేజ, ఎ.జానకి

చేతి రాత (ఇంగ్లిష్).. కె.శిరీష, జి.జయత్ర సాయి మీనాక్షి, దాలు లెనిన్ కుమార్



విజేతకు సర్టిఫికెట్ అందజేస్తున్న డైట్ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆయూబ్ హుసేన్

రంగోలి పోటీలు.. జి.అక్షరశ్రీ, ఎస్.సుదర్శని, ఎం.జి యమునా, ఆర్.సుమశ్రీ, బి.మమత, కె.పావని, వి.శివకీర్తి, కె.శైలజ, బి.సుస్మిత, బి.సిరి

ఫోక్ డ్యాన్స్ పోటీలు.. పి.సమీరా, జి.ఎస్ లిఖిత, ఎం.సురక్ష, ఎస్.నిశిక, ఎ.దక్షసాయి, వి.అవంతిక, ఆర్.నవ్యశ్రీ, ఎం.హిమవర్షిణి

యూనిటీ, ఇంటిగ్రిటీ పోస్టర్ పోటీలో.. ఎం.కె ఆదిత్య, ఎ.రవి తేజ

స్లోగన్ పోటీలో.. ఈ.దీప్సావిత, కె.మాధవి

రోల్ ప్లే పోటీలో.. ఎస్.అఫియా, ఎం.భవిత, వి.బిందు, ఎ.కావ్య, పి.యాస్మిన్, ఎం.శరణ్య, జి.లాస్య.

గోదా గోకులంలో నిత్య కల్యాణం ప్రారంభం



నిత్య కల్యాణం వేడుక బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న గోదా గోకులం ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: గోదా గోకులంలోని గోదా రంగనాయకి సమేత శ్రీ రంగనాథ స్వామి వారి దేవాలయంలో నిత్య కల్యాణం ప్రారంభించినట్లు గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త తెలిపారు. బుధవారం గోదా గోకులంలో నిత్యకల్యాణానికి సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించి మాట్లాడారు. త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి ఆదేశాల మేరకు విశ్వ కళ్యాణ శ్రేయస్సుకై గోదాగోకులం కేంద్రంగా నిత్య కళ్యాణం పచ్చ తోరణానికి శ్రీకారం చుట్టామన్నారు. 365 రోజులు స్వామి వారికి కళ్యాణం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రంగనాథుని కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండేలా, అందరిలో ఆధ్యాత్మిక చింతన పెంపొందేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కిరణ్ బట్టాచార్, రమేష్ బట్టాచార్ మాట్లాడారు. సమావేశంలో గోదా గోకులం సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, ఇటిక్యాల పుల్లయ్య, బాల సుధాకర్ పాల్గొన్నారు.

డీసీసీబీ నూతన సీఈవో రానట్లే?

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా నియమితులైన ఎం.వెంకటేశ్వరస్వామి బాధ్యతలు స్వీకరించడం ప్రశ్నార్థకంగా మారింది. డిసెంబర్ 30వ తేదీన ఈయనను సీఈవోగా నియమిస్తూ డీసీసీబీ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్, జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఉత్తర్వులు జారీ చేశారు. నియామక ఉత్తర్వులు ఇచ్చి దాదాపు 25 రోజులు అవుతున్నప్పటికీ విధుల్లో చేరే విషయంపై స్పష్టత లేదు. ఈయన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జనరల్ మేనేజర్‌గా పని చేసి ఏడాది క్రితం పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. అయితే ఫైనాన్సియల్ సెక్టారులో పని చేయాలంటే యూబీఐ నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఇవ్వాలి. అయితే ఎన్‌ఓసీ రాకపోవడమే, ఇంతకంటే మంచి పోస్టు కోసం ప్రయత్నమో.. ఏదో తెలియదు కానీ కర్నూలు డీసీసీబీ సీఈవోగా విధుల్లో చేరరనే చర్చ నడుస్తోంది.

ప్రతి భక్తుడిని అతిథిగా భావించి సేవలందించాలి

- ఫిబ్రవరి 19 నుంచి శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- అందరి సమన్వయంతో విజయవంతం చేయాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ రాజకుమారి



జిల్లా అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో త్వరలో జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులను అతిథిగా భావించి సేవలందించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులకు సూచించారు. ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం దేవస్థాన అన్నప్రసాద వితరణ భవనంలో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, మార్కాపురం సబ్ కలెక్టర్ సాదిక్ త్రివినాథ్, అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, శ్రీశైలం సబ్ డీఎఫ్‌వో మహమ్మద్ అన్సర్ అలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ముందుగా శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు గతేడాది జరిగిన ఉత్సవాల నిర్వహణ, బ్రహ్మోత్సవ క్రతువులు, పట్టువస్త్రాలు, ప్రస్తుతం చేపట్టిన పనులపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ శాఖల వారీగా సమీక్షించారు. అవసరమైన ప్రతిపాదనలను సమర్పిస్తే దేవస్థానం ఈఓని సమన్వయం చేసి సంబంధిత ఏర్పాట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీరు, టాయిలెట్స్, పార్కింగ్, రవాణా, భక్తులకు స్వామివారి అలంకార దర్శనం తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన స్వామిఅమ్మవార్ల దర్శనం కల్పించాలన్నారు. మన ఇంటికి వచ్చిన వారిని ఎంత ఆత్మీయంగా పలకరించి, మర్యాదలు చేస్తామో, శివరాత్రికి వచ్చిన భక్తులను కూడా అదేవిధంగా సేవలందించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మహాకుంభమేళా నిర్వహణను ఆదర్శంగా తీసుకుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు.

శాఖల వారీగా సమీక్ష ఇలా..

- బ్రహ్మోత్సవాల 11రోజుల్లో సాక్షిగణపతి ఆలయం వద్ద వాహనాలకు టోల్ వసూలు చేయకూడదని అటవీశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.
- ఘాట్‌రోడ్డులో కాన్వెక్స్ మిర్రర్లను ఏర్పాటు చేయాలని, ఘాట్‌రోడ్డులో ప్యాచ్ వర్క్, రోడ్డుకు ఇరువైపులా బరమ్స్, రక్షణగోడలు నిర్మించాలని ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.
- పాతాళగంగలో, క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. పాతాళగంగ వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
- గతంలో నడిపిన బస్సు సర్వీసుల కంటే అదనంగా ఈ ఏడాది వాహనాలను నడపాలని ఏపీఎస్ ఆర్టీసీ, కర్ణాటక ఆర్టీసీ, తెలంగాణ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.
- భీమునికొలను, కైలాసద్వారం ప్రాంతాలలో, కాలినడకవచ్చే భక్తులు ప్రమాదానికి గురైతే బాధితులకు స్ట్రెచ్చర్లు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. పటిష్ట ప్రణాళికలతో పార్కింగ్ ప్రదేశాలను గుర్తించాలన్నారు.
- వివిధ సెక్టార్లలోని ఉద్యోగులకు క్యూర్‌కోడ్ ఐడెంటి కార్డులను అందించాలన్నారు.